ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025 | 5



4న జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవం
అధ్యక్షత కులపతి, రాష్ట్రగవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్
ముఖ్య అతిథిగా విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ 6
డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో! 7
ఆన్‌లైనా.. ఆఫ్‌లైన్‌లోనా » ఎటూ తేల్చని ప్రభుత్వం

దాడులకు పాల్పడితే కఠిన చర్యలు


- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సమావేశం
- కేసుల సత్వర విచారణకు కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం



విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై అన్యాయంగా దాడులకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో 2025 రెండో త్రైమాసికానికి సంబంధించి కమిటీ సభ్యులతో జిల్లాస్థాయి పౌర హక్కుల రక్షణ, ఎస్సీ, ఎస్టీ దురాగతాల నివారణ చట్టం అమలుపై ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఎస్సీ, ఎస్టీల అట్రాసిటీ కింద నమోదైన కేసులు సత్వరం పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు కృషిచేయాలని, ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు ఎప్పటికప్పుడు జారీచేయాలని సూచించారు. నిజమైన బాధితులకు న్యాయం జరిగినప్పుడే ఎస్సీ, ఎస్టీ చట్టం ముఖ్యోద్దేశం నెరవేరుతుందన్నారు. పౌర హక్కుల రక్షణ చట్టం పటిష్ఠంగా అమలుచేయాలని పోలీసు, న్యాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఇందుకోసం పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి వివరించారు. రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణంగా ఏర్పాటైన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక చట్టాలను అధికారులను పటిష్ఠంగా అమలుచేయాలని, బాధితులకు పరిహారం, ఉపాధి కల్పన విషయంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీల వారికి ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు పొందేందుకు సామాజిక న్యాయం అందేందుకు, అగ్రవర్ణాల అత్యాచారాల నుంచి రక్షణ పొందేందుకు ఈ చట్టం రూపొందించారని, ఈ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సభ్యులు సూచించారు. జిల్లావ్యాప్తంగా 66 కేసులు నమోదుకాగా 47 కేసులు ప్రాథమిక విచారణ దశలో, 20 కేసులు చార్జిషీటు దశలో ఉన్నాయని, బాధితులకు రూ. 45.25 లక్షలు పరిహారంగా చెల్లించాల్సిందని ప్రభుత్వం మంజూరు చేయాల్సిందిగా కోరారు. ఈ కేసుల విచారణను వేగవంతంచేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అంతర్గత రోడ్లు, సాగునీటి కుళాయిలు, ఇతర సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ వసతిగృహాల్లో గెయిల్, సీఎస్సార్ నిధులతో ఇచ్చిన ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు టీఎస్ఆర్కే ప్రసాద్ ఎస్.మురళీమోహన్ పాల్గొన్నారు.

అవినీతి ఆరంభం : కాకినాడ జిల్లా కొమరగిరిలో జగనన్న ఆరంభించిన లేఅవుట్



నేతలు.. మహా మేతలు!

అతి పెద్ద స్కామ్ ఇక్కడే..

అతిపెద్ద స్కాం కొమరగిరి లేఅవుట్‌లోనే ఉన్నట్టు విజిలెన్స్ నిర్ధారించింది. అప్పట్లో సీఎం జగన్ ఇక్కడి నుంచి పేదల ఇళ్ల పథకం ప్రారంభించడంతో లోతట్టుగా ఉన్న 350 ఎకరాల కొమరగిరి భూములు చదునుకు రూ.125 కోట్ల వరకు వెచ్చించింది. ఈ పనులు అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చేశారు. గ్రావెల్‌ను పోలవరం కాలువలు, పెద్దాపురం రామేశంమెట్ట నుంచి తరలించేశారు. అధికారులేమో అడ్డగోలుగా రూ.35 కోట్ల వరకు బిల్లులు ఇచ్చేశారు. దీనిపై అప్పట్లో ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్ చదునుకు ఎకరాకు కనీసం రూ.15 లక్షల్లోపు చేయాల్సి ఉన్నా రెట్టింపు బిల్లులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేసినా చర్యల జోలికి వెళ్లలేదు. విచారణ బృందాలు ఈ అక్రమాలు తవ్వనున్నాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నేతలు.. మేతలు.. పేదల ఇళ్ల స్థలాల ముసుగులో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు, అధికారులు ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్లు మెక్కేశారు. అంచనాలు అడ్డంగా పెంచేసి.. కోట్లలో బిల్లులు నొక్కేసి ఖజానాకు పంగనామాలు పెట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1600 లేఅవుట్లలో సుమారు 19 వేల ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతర విషయాలలో అవకతవకలు జరిగినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పుడు అవినీతి డొంక కదల్చడానికి నేరుగా రంగంలోకి దిగింది. డ్వామా ఏపీడీలు, రాజధాని నుంచి పంపిన నరేగా క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలతో వేట మొదలుపెట్టింది.

కాకినాడలో 324 లేఅవుట్లు..

కాకినాడ జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 3,84,218 మంది లబ్ధిదారులను ఇళ్ల స్థలాలకు గుర్తించింది. 7,218 ఎకరాలు కావాల్సి ఉండగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమిపోను 5,362 ఎకరాలను రూ.2,566 కోట్లతో రైతుల నుంచి కొనుగోలుచేసింది. 2020 డిసెంబరు 25న అప్పటి సీఎం జగన్ కొమరగిరి వచ్చి తొలిసారిగా ఇళ్ల స్థలాల పథకం ప్రారంభించారు. అలాగే జిల్లావ్యాప్తంగా 324 లేఅవుట్లలో పేదలకు స్థలాలు కేటాయించారు. ప్రభుత్వం మారగానే జగనన్న లేఅవుట్లలో అక్రమాలపై విజిలెన్స్ అధికారులు దృష్టిపెట్టారు. 80 శాతం లేఅవుట్లలో భారీ అవినీతి జరిగిందని నిర్ధారించారు. కాకినాడ జిల్లాలో రూ.321 కోట్ల రెట్టింపు అంచనాలతో 152 లేఅవుట్లలో చేసిన పనులపై విచారణకు ఆదేశించింది. మరో 121 లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రూ.42 కోట్ల బిల్లుల అవినీతిపైనా దృష్టి పెట్టింది. 324 లేఅవుట్లలో చదును చేసిన రూ.650 కోట్ల బిల్లుల లెక్క తేల్చబోతోంది.

పేదల ముసుగు..పెద్దల లోసుగు

- జగనన్న లేఅవుట్లలో భారీ అవినీతి
- ప్రత్యేక బృందాలతో విచారణ
- అడ్డగోలు చెల్లింపులపై ఆరా
- రూ.70 కోట్లు బిల్లుల పెండింగ్
- వేట ఆరంభించిన ప్రభుత్వం
- లేఅవుట్లలో 80 శాతం అక్రమాలే
- వెలుగు చూస్తున్న వైనం

డొంకంతా కదలాల్సిందే..

విజిలెన్స్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు పంపిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక బృందాలను నియమించింది. అక్రమాలు భారీగా ఉన్న లేఅవుట్లలో ఎంతమేర నిధులు మెక్కేశారో తేల్చాలని నిర్ణయించింది. విచారణను రెండు భాగాలుగా విభజించింది. తొలి భాగం కింద జరిగిన పనుల పెండింగ్ బిల్లులకు సంబంధించి అక్రమాలపై విచారణ చేపడతారు. ఈ తరహా జిల్లాలో 121 లేఅవుట్లను గుర్తించారు. చదును, రహదారులు, డ్రైన్లు, మంచినీరు తదితర పనులకు రూ.120 కోట్ల వరకు ఇదివరకే చెల్లించగా ఇంకా రూ.42 కోట్లు బాకీలు చూపిస్తున్నారు. ఆయా లేఅవుట్లను తనిఖీ చేస్తున్నారు. రెండో అవినీతి కింద అనేక లేఅవుట్లలో అవసరం లేకున్నా ఒక్కో లేఅవుట్‌లో రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు కాకిలెక్కలతో బిల్లులు చేసుకుని డబ్బులు కాజేశారు. జిల్లాలో 17 మండలాల్లో 152 లేఅవుట్లకు రూ.321 కోట్ల వరకు వ్యయ అంచనాలు చూపించారు. ఎకరాకు రూ.25 లక్షలకుపైగా చదును బిల్లులు చూపించి కోట్లలో డబ్బులు కొట్టేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే 324 లేఅవుట్లలో చదునుకు సంబంధించి రూ.650 కోట్ల వరకు బిల్లులు అప్పట్లో చెల్లించగా ఇందులో రూ.220 కోట్ల వరకు తప్పుడు బిల్లులే ఉన్నట్టు ప్రభుత్వం అనుమానిస్తోంది.

కోనసీమలోనూ..కుమ్ముడే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో వేసిన లేఅవుట్లలో ఫిల్లింగ్ అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. జిల్లాలోని నీటి యాజమాన్య సంస్థకు చెందిన ముగ్గురు ఏపీడీలు, అమరావతి నుంచి వచ్చే నరేగా క్వాలిటీ కంట్రోల్ టీమ్ సభ్యులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 111 లేఅవుట్లలో 241 పనులకు సంబంధించి రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. వీటితోపాటు గతంలో చేసిన, చేయని పనులకు కూడా భారీగా నిధులు డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు సంబంధించిన పనులను పర్యవేక్షించేందుకు క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు రంగంలోకి దింపింది. ఈ టీమ్‌లు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నాయి. పెండింగ్ బిల్లులతోపాటు గతంలో కాలనీల్లో జరిగిన అక్రమాలపై ఈ బృందం విచారణ జరుపుతున్నట్టు సమాచారం.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలోనూ పేదల ఇళ్ల స్థలాల పేరుతో కోట్లలో మెక్కేశారు. అవినీతి లెక్కతేల్చడానికి రాజమండ్రి రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు 4 బృందాలు ఏర్పాటుచేశారు. 324 లేఅవుట్లకు సంబంధించి రూ.6.6 కోట్లు అవకతవకలు జరిగినట్టు నిర్ధారించారు. రెట్టింపు అంచనాలకు సంబంధించి 7 మండలాల్లో 22 కోట్లు అవకతవకలు జరిగినట్టు తేల్చారు. లోతట్టు ప్రాంతాల్లో నిబంధనల మేరకు ఫిల్లింగ్ చేయకుండా వదిలేసిన కొన్ని ఇళ్లను గుర్తించారు. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నారు.

తూర్పున మెక్కేశారు!

కోరుకొండ మండలం బూరుగుపూడి, మధురపూడి తదితర ప్రాంతాల్లో పనికిరాని ఆవ భూములకు ఎకరానికి రూ.43 లక్షల వంతున చెల్లించి అవకతవకలకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపైనా విచారణ జరుగుతోంది. ఆవ భూమిలో సుమారు 6 మీటర్ల లోతు వరకూ నీరు నిలిచిపోతుందని.. ఇది నివాస యోగ్యం కాదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అసలు రైతుకు ఎంత ఇచ్చారు. అప్పట్లో అక్కడ మార్కెట్ విలువ ఎంత? ఎంత ఎక్కువ చెల్లించారు. ఎవరెవరి ప్రమేయం ఇందులో ఉందనే తదితర అంశాలపై నిశితంగా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. త్వరలో అవకతవకల నిగ్గుతేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

మరింత పారదర్శకంగా..



ముఖ గుర్తింపు కోసం ఫొటోలు తీస్తున్న అంగన్‌వాడీ నిర్వాహకులు

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందాలంటే ముఖ గుర్తింపు తప్పనిసరి
- జూలై 1 నుంచి అమలు

అమలాపురం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందాలంటే ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నేషన్) తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీలు, బాలింతలు, సున్నా నుంచి మూడేళ్లలోపు పిల్లలందరికీ సెల్‌ఫోన్‌లతో ముఖం గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. పోషణ్ ట్రాకర్ అప్లికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు తీసిన ముఖ చిత్రాలన్నీ స్త్రీ,శిశు సంక్షేమశాఖ డైరక్టరీ కార్యాలయానికి అనుసంధానం అవుతాయి. తద్వారా బడ్జెట్ రిలీజ్ అవుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శాంతకుమారి తెలిపారు. ప్రతీనెల రెండు విడుతలుగా బాలింతలు, గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తారన్నారు. పౌష్టికాహారం అందించడంతోపాటు నిర్ణీత సమయాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ న్యూట్రిషన్ డే నిర్వహించి వారికి వైద్య పరీక్షలు సైతం నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ముఖ గుర్తింపు ప్రక్రియ 83.33శాతం పూర్తి చేశామని, నూరుశాతం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నట్టు శాంతకుమారి తెలిపారు. ముఖ గుర్తింపు ఆధారంగా జూలై1 నుంచి పౌష్టికాహార పంపిణీ జరుగుతుందన్నారు. పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించే లక్ష్యంతోనే ముఖ గుర్తింపును తప్పనిసరి చేశారని వివరించారు.

1726 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా..

కోనసీమ జిల్లాలోని ఏడు ప్రాజెక్టుల పరిధిలో 1926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 7,803 మంది గర్భిణీలు, 5,988 మంది బాలింతలు, సున్నా నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలు, ప్రీస్కూలు పిల్లలతో కలిపి 75,721 మంది ఉన్నారు. వీరందరికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. ముఖ గుర్తింపు పూర్తయిన వారికి మాత్రమే ఇక నుంచి పౌష్టికాహారం అందుతుంది. తప్పనిసరిగా గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ముఖ గుర్తింపును చేయించుకోవాలి.

పౌష్టికాహారం అందించేది ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రతీ నెల న్యూట్రిషన్ కిట్లు అందిస్తారు. ఒక్కో కిట్‌లో 2 కిలోల రాగిపిండి, 250 గ్రాముల బెల్లం, కిలో అటుకులు, 250 గ్రాముల పల్లీ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం ఉంటాయి. వీటితోపాటు వారికి ఒక కిలో కందిపప్పు, అరలీటరు ఆయిల్, మూడు కిలోల బియ్యం అందిస్తారు. ఇక సున్నా నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, రెండున్న కిలోల బాలామృతం అందిస్తారు. ఇక ప్రీ స్కూలులో ఉన్న మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీరోజు ఒక గుట్టు అందిస్తారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం నిర్దేశించిన పౌష్టికాహారం అందిస్తారు.

ఎస్సీలకు త్వరలో ఉచిత సోలార్ కనెక్షన్‌లు



- ఏర్పాటుకు పూర్తయిన సర్వే
- జిల్లావ్యాప్తంగా అర్హులైన వారు 78,780 మంది
- అనుమతులు రాగానే ఏర్పాటుకు రంగం సిద్ధం

మండపేట, జూన్27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ కనెక్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. సూర్యఘర్ పేరిట ఈ సోలార్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు సబ్సిడీపై అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తోంది. ముఖ్యంగా ఎస్సీలకు సంబంధించి ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా సోలార్ కనెక్షన్‌లు ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా ఎస్సీలకు సంబంధించి అర్హత కలిగిన ప్రతి ఇంటికి సోలార్ కనెక్షన్‌ను వందశాతం రాయితీతో ప్రభుత్వం సమకూర్చనుంది. ఈమేరకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సర్వే కూడా పూర్తయింది. జిల్లాలో ఈ పథకానికి అర్హత ఉన్నవారుగా మొత్తం 78,780 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరందరికీ ఉచితంగా సోలార్ కనెక్షన్లను అందించడం జరుగుతుందని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజబాబు తెలిపారు. సర్వే అనంతరం ప్రభుత్వ అనుమతుల కోసం ఇప్పటికే నివేదికను పంపామని, అనుమతులు రాగానే సోలార్ సిస్టంను ఎస్సీల ఇళ్లకు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఇక మరోపక్క జిల్లాలో బీసీలకు సంబంధించి కూడా సోలార్ సిస్టంలను అందించేందుకు వీలుగా అర్హులైన వారి ఇళ్ల సర్వే జరుగుతోందని ఎస్ఈ రాజబాబు తెలిపారు. ఇప్పటివరకు బీసీలకు ప్రభుత్వం సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.78000 సబ్సిడీ ఇస్తుండగా, అదనంగా మరో రూ.20వేలను పెంచి మొత్తం రూ.98 వేలు మేర సబ్సిడీని ఇస్తుందని ఆయన చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారంతా సోలార్ సిస్టం విద్యుత్ వినియోగించుకుని ప్రభుత్వం అందించే సబ్సిడీ ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వినియోగదారులను కోరారు.

పంటకాల్వల వెంబడి ఆక్రమణలు తొలగించండి

- తాగునీటి సరఫరాలో ఇబ్బందులను తొలగించాలి
- జేసీ నిషాంతి ఇరిగేషన్ అధికారులకు ఆదేశం

అమలాపురం,జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటకాల్వల వెంబడి ఉన్న ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేసి తమకు సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో మూడు రెవెన్యూ డివిజనల్ ఆర్డీవోలతో కీలక సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇరిగేషన్ కాల్వల పరిధిలో ఉన్న ఆక్రమణలు గుర్తించి వాటి తొలగింపునకు ప్రణాళికలను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు. ఆక్రమణల కారణంగా తాగునీటి సరఫరాకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఆక్రమణల తొలగింపునకు సత్వర చర్యలు చేపట్టాల్సిందిగా జేసీ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు మాధవి, శ్రీకర్, అఖిల, ఇరిగేషన్ అధికారులు, పలు నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పి.గన్నవరం ప్రధాన పంటకాల్వ



సెంట్రల్ డెల్టాపై ఎందుకీ వివక్ష?

- గన్నవరం, అమలాపురం సబ్ డివిజన్లకు ఇంచార్జ్‌లే డీఈలు
- సెంట్రల్ డెల్టా పరిధిలో ఐదు నియోజకవర్గాలు
- సెంట్రల్ డెల్టాలో సుమారుగా 2 లక్షల ఎకరాలు ఆయకట్టు
- సాగునీరు పంపిణీ వ్యవస్థపై తీవ్ర అలసత్వం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

పి.గన్నవరం, జూన్27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు పంటలు సజావుగా సాగాలంటే ధవళేశ్వరం బ్యారేజ్ దిగువున పనిచేస్తున్న ఇరిగేషన్ సెంట్రల్, ఈస్ట్రన్ డివిజన్‌ల పరిధిలో కీలక అధికారులు పూర్తి స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉంది. సాగునీటి పంపిణీలో ఇరిగేషన్ వ్యవస్థ అత్యంత కీలకం. ఇది పటిష్టంగా ఉంటేనే సాగునీరు ఏవిధమైన ఆటంకాలు లేకుండా శివారు ప్రాంతాలకు సైతం అందుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న సెంట్రల్, ఈస్ట్రన్ డెల్టాలకు సంబంధించి సెంట్రల్ డెల్టా మరింత కీలకమైంది. ఇది ఎక్కువశాతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉంది. దీని పరిధికి సంబంధించి సుమారుగా 2 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సెంట్రల్ డెల్టా పరిధిలోనే అమలాపురం, పి.గన్నవరం సబ్‌డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి కొత్తపేట నియోజకవర్గంలో మూడు మండలాలతోపాటు పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం (మూడు మండలాలు), రాజోలు నియోజవర్గాలకు సంబంధించి ఐదు నియోజకవర్గాలకుగాను 16 మండలాలు ఉన్నాయి. రెండు సబ్‌డివిజన్లకు 9 సెక్షన్‌లు ఉన్నాయి. మేజర్ సబ్‌డివిజన్లగా భావించే అమలాపురం, పి.గన్నవరంలలో ఇంచార్జ్ డీఈలు బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ఇటీవలే జరిగిన బదిలీల్లో సెంట్రల్ డెల్టాకు ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన అమలాపురం డీఈ బి.శ్రీనివాస్ అడ్డతీగల సబ్ డివిజన్‌కు వెళ్లారు. పి.గన్నవరం సబ్‌డివిజన్‌లో అతి తక్కువకాలం పనిచేసిన డీఈ నాగేంద్రకుమార్ గుడివాడ డ్రైన్స్‌కు డీఈగా బదిలీపై వెళ్లారు. దీంతో అమలాపురం సబ్‌డివిజన్‌కు రాజమహేంద్రవరం సబ్‌డివిజన్ డీఈగా పనిచేస్తున్న డీఈ అదనపు బాధ్యతలు స్వీకరించారు. అలాగే రాజోలు సబ్‌డివిజన్ డ్రైన్స్ డీఈగా పనిచేస్తున్న నాగార్జునరావు పి.గన్నవరం ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో అదనపు బాధ్యతలు స్వీకరించారు. వీరికితోడు సెంట్రల్ డివిజన్ పరిధిలోని 9 సెక్షన్లుండగా, వాటిలో అమలాపురం సెక్షన్ కొంతకాలంగా ఖాళీగా ఉంది. గోపాలపురం తాటిపాక సెక్షన్‌లకు సంబంధించి ఇప్పటివరకు జేఈలు బాధ్యతలు స్వీకరించిన దాఖలాల్లేవు. బదిలీలు జరిగి వారం పదిరోజులు అవుతున్నా సంబంధిత జేఈలు బాధ్యత స్వీకరించక పోవడం గమనార్హం. ఇరిగేషన్‌తోపాటు హెడ్ వర్క్స్, డ్రైన్స్ అనుబంధ వ్యవస్థలుగా పనిచేస్తాయి. అయితే సంబంధిత అధికారులు ఇరిగేషన్ లోకా వద్దు.. డ్రైన్స్‌కానీ హెడ్‌వర్క్స్‌గాని చూసుకో వచ్చు అంటూ వెనకడుగు వేస్తున్నారని సమాచారం. స్థానికంగా ఉన్న ఒత్తుళ్లు, ఇతరత్రా కారణాలతో ఇరిగేషన్ వైపు అధికారులు మొగ్గు చూపడం లేదని, ఒత్తిళ్లలేని హెడ్‌వర్క్స్ డ్రైన్స్ వైపు వెళ్లిపోతున్నారని పలువురు అధికారులు చెప్పుకుంటున్నారు. దీంతో ఇరిగేషన్‌లో ఉన్న అధికారుల స్థానాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని మంత్రితోపాటు సెంట్రల్ డెల్టా పరిధిలో ఐదు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరికి తోడు నీటి సంఘాలకు ప్రతినిధులు ఉన్నారు. అయితే వీరెవరూ ఇరిగేషన్‌శాఖ ఇన్‌చార్జుల పాలనలోనే నడుస్తుండడంపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టి పెట్టాల్సి ఉంది.



అమలాపురంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు చిట్టిబాబు

నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి రాక

అమలాపురం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అమలాపురం పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగే కాంగ్రెస్ జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొంటారని జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. అమలాపురంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిలారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ సెక్రటరీ పి.వర్మ, ఏఐసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ఏలేశ్వరపు రాధాకృష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు, షకీలా, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ బ్లెసన్‌కు కన్నీటి వీడ్కోలు 7



నగరాల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లలో జరిగే పలు వేడుకలు నేడు మినీ థియేటర్లలో జరిగిపోతున్నాయి. అతి కొద్దిమంది కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులను ఆహ్వానించి సింపుల్‌గా కానిచ్చేస్తున్నారు. అందుకోసం మినీ థియేటర్లను ఆశ్రయిస్తున్నారు. ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డారు.

ఆనందం

'మినీ'మమ్ గ్యారంటీ...

- నగరాల్లో 'నయా' ట్రెండ్
- పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లకు కాస్త బ్రేక్
- మినీ థియేటర్లను ఆశ్రయిస్తున్న జనం
- తక్కువ ఖర్చు, అదనపు సౌకర్యాలు
- ఇవే వీటి ప్రత్యేకత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న వారికి జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, ఇతరత్రా పార్టీలు జరుపుకోవాలన్న కోరిక ఎక్కువగా ఉంటుంది. ఫంక్షన్ హాలు బుక్ చేసుకుని అతిథులను పిలిచి చేసుకోవాలంటే ఖర్చు తడిసిమోపెడవుతుంది. ఒకవేళ రెస్టారెంట్‌కు వెళ్లినా అక్కడ డైనింగ్ టేబుల్‌పై కేవలం కేక్ కటింగ్‌కు మాత్రమే అనుమతిస్తారు. ఇంట్లో చేసుకోవాలంటే డెకరేషన్‌కు చాలా ఖర్చవుతుంది. ఈ గ్యాప్‌ను కవర్ చేసేందుకు కాకినాడ నగరంలో కొంత మంది మినీ థియేటర్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. నగరంలో పలుచోట్ల వీటిని ఏర్పాటుచేసి అద్దెకు ఇస్తున్నారు. పుట్టినరోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులతో సరదాగా కాసేపు ఎంజాయ్ చేసే కార్యక్రమాలకు వీటిని ఇస్తున్నారు. రూ.3వేలు ఖర్చు చేస్తే సరిపోతుంది. నలుగురు సభ్యులకు రూ.2,500, ఆ తర్వాత ప్రతి అదనపు కుటుంబసభ్యుడికి రూ.250 చెప్పున చార్జ్ చేస్తారు. కాకినాడలోని మెయిన్‌రోడ్డు, జగన్నాథపురం, సినిమారోడ్డు, జేఎన్టీయూకే ఎదురుగా ఉన్న వీధి.. ఇలా పలుచోట్ల ఈ మినీ థియేటర్లను ఏర్పాటు చేశారు. చిన్నచిన్న పార్టీలు, ఫంక్షన్ల నిర్వహణకు ఇవి సిద్ధంగా ఉన్నాయి.

అడ్వాన్స్ బుకింగ్ చేసుకునేలా..

ఈ మినీ థియేటర్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు. కోరుకున్న ఫుడ్ ఐటెంలను తయారు చేసుకుని తీసుకువెళ్లవచ్చు. ఫుడ్ డెలివరీ సంస్థలకు ఆర్డర్లు పెట్టుకోవచ్చు. మినీ థియేటర్ల యాజమాన్యాలకు చెప్పినా వాళ్లు తెప్పించి బిల్లులో వాటిని జత చేస్తారు.

థియేటర్‌ను తలదన్నేలా..

మినీ థియేటర్‌లోకి అడుగు పెడుతూనే ప్రజలు కొత్త అనుభూతి పొందుతున్నారు. లోపల పెద్ద థియేటర్ స్క్రీన్, డాల్బీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటుంది. స్క్రీన్ సైజులు 135 నుంచి 180 అంగుళాలు, సౌండ్ 600 వాట్స్ నుంచి వెయ్యి వాట్స్ వరకు ఉంటున్నాయి. ఫాగ్ ఎంట్రీలు కూడా కొన్ని థియేటర్లలో ఉంటు న్నాయి. ఫొటో షూట్ కావాలన్నా ఏర్పాటు చేస్తున్నారు. లోపల సినిమా సెట్‌ను తలదన్నేలా ఫాగ్ ఉంటుంది. సినిమా థియేటర్ తరహాలో సోఫా సీట్లు ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ లైటింగ్, కేక్‌లు కట్ చేసుకునేందుకు వేదిక ఉంటుంది. వేదికపై డెకరేషన్, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వైఫై సౌకర్యం, థియేటర్ బయట అందమైన బ్యాక్ డ్రాప్‌లు రూపొందిస్తున్నారు. 16 డిగ్రీల సెల్సియస్‌తో చల్లటి వాతావరణం ఉండేలా ఏసీ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంటిల్లిపాదీ వెళ్లి ఆనందంగా వేడుక నిర్వహించుకునేలా అన్ని సౌకర్యాలు ఉండడం ఈ మినీ థియేటర్ల ప్రత్యేకత.


ప్రజల అభిరుచికి తగ్గట్టుగా మినీ థియేటర్‌లో అలంకరణలు



ప్రత్యేకతలేమిటంటే...

ఈ మినీ థియేటర్లలో డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అందులో ఇష్టమైన సినిమా, టీవీ షోలను వీక్షిస్తూ ఆస్వాదించొచ్చు. కొందరైతే గతంలో రికార్డు చేసిన ఫంక్షన్ల పెన్‌డ్రైవ్‌లు, కాలేజీల్లో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు, ఫేర్‌వెల్ పార్టీల వీడియోలు తీసుకొచ్చి వాటిని ప్రదర్శించుకుంటూ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందం పొందుతున్నారు. స్నాక్స్, ఇతర ఫుడ్ ఐటమ్‌లు, బెవరేజస్ తెప్పించుకుని సెల్ఫ్ సర్వ్ చేసుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు.




మినీ థియేటర్‌లో ఫంక్షన్ వేళ...

రెస్పాన్స్ బాగుంది



మేము తొలుత హైదరాబాద్‌లో ఈ మినీ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. స్మార్ట్ సిటీ కాకినాడలో కూడా ఇలాంటి కల్చర్ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో జేఎన్టీయూ ఎదురుగా ఉన్న వీధిలో మినీ థియేటర్ ఏర్పాటు చేశాం. రెస్పాన్స్ బాగుంది. సింపుల్‌గా చిన్న చిన్న పార్టీలు సరదాగా రెండు, మూడు గంటలు గడిపేలా వాతావరణం క్రియేట్ చేశాం. చాలా మంది సందర్శిస్తున్నారు.

- వేణుగోపాల్, మినీ థియేటర్ నిర్వాహకుడు



వచ్చే నెల 4న

జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవం

- అధ్యక్షత వహించనున్న కులపతి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- ముఖ్య అతిథి, బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యానికి గౌరవ డాక్టరేట్
- ప్రత్యేక అతిథిగా పాల్గొననున్న విద్యా శాఖ మంత్రి లోకేశ్

జేఎన్టీయూకే, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవాన్ని వచ్చే నెల వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామన్నారు. విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా హాజరయ్యే అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారన్నారు. బీటెక్, బి.ఫార్మసీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఫార్మా-డి, బీఆర్క్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. 99 మంది రీసెర్చ్‌స్కాలర్స్ పీహెచ్‌డీ పట్టాలు అందుకోనున్నారు. కులపతి, ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్, బంగారు పతకాలు అందజేస్తారని తెలిపారు. స్నాతకోత్సవ వేడుకల్లో మాజీ ఉప కులపతులు, అతిథులు, విద్యావేత్తలు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు, ఉన్నత విద్యా శాఖాధికారులు, జిల్లా అధికారులు, విద్యావేత్తలు, వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

డిగ్రీలు, పీహెచ్‌డీలు, బంగారు, ఎండోమెంట్ పతకాల వివరాలు

కోర్సు పేరు	2023-24 విద్యా సంవత్సరం
బీటెక్	41,258
బి.ఫార్మసీ	2,081
ఎంటెక్	1,659
ఎంబీఏ	3,797
ఎంసీఏ	1,115
ఎం.ఫార్మసీ	458
బీబీఏ	115
ఫార్మా-డి	274
బీఆర్క్	83
పీహెచ్‌డీ	100

నన్నయలో విద్యాప్రవేశాలకు ఆహ్వానం

వీసీ ప్రసన్నశ్రీ


కోర్సుల వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూన్27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వీసీ కార్యాలయంలో విశ్వవిద్యాలయాల ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నన్నయ వర్సిటీ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో పీజీ కోర్సులు అందిస్తున్నామన్నారు. ఆయా క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్న కోర్సులు వివరాలు తెలిపారు. తాము పేర్కొన్న వివిధ కోర్సులకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి ప్రవేశం అభిస్తుందన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో అడ్మిషన్ పొందిన అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను లేదా 70930 08477 నెంబరును సంప్రదించాలని తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, అసోసియేట్ డైరెక్టర్ ఎస్.సజనారాజ్ నిర్వహిస్తారన్నారు.

కాపులను సంఘటితం చేస్తాం

రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు


ఎంపీ సతీష్‌బాబును సత్కరిస్తున్న క్రికెట్ అసోసియేషన్

సామర్లకోట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపులందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఆ సామాజికవర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సంఘటితం చేస్తామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు వెల్లడించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లాలకు చెందిన కాపు సంఘ నాయకులు, కాపు ప్రముఖులతో అంతరంగిక సమావేశం నిర్వ హించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ గతంలో జరిగిన పలు ఉద్యమాలను దృష్టిలో ఉంచుకుని ఏ వర్గానికీ, ఏ నాయకుడికీ అవమానం జరుగని రీతిలో కాపు నాయకులతో సమీక్షిస్తానన్నారు. రాష్ట్రంలో కాపు సంఘాలను లీడ్ చేయాలన్న ఆలోచన తనకు ఎంతమాత్రం లేదని ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఆ సామాజిక వర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడిగా, సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్‌లతో ఉన్న సాన్నిహిత్యంతో పేద కాపులందరికీ న్యాయం చేసేందుకు తన వంతు ప్రయత్నంగా ముందుకొచ్చానన్నారు. రాష్ట్రంలోని కాపు నాయకుల అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటానని, తన ప్రయత్నానికి సహకారం కావాలన్నారు.

ఎంపీని కలిసిన క్రికెట్ అసోసియేషన్

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును కాకినాడలోని శాంతినగర్‌లో తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, కార్యదర్శి కొప్పన ప్రసాద్, కోశాధికారి భారతం సూర్యనారా యణమూర్తి, సంయుక్త కార్యదర్శి నక్క శ్రీనగేష్, కౌన్సిల్ మెంబర్లు ఏవీటీ వర్మ, బీవీఎల్ నరసింహారావు తదితరులున్నారు.

తిరుపతి జిల్లా నుంచి పలువురు బీజేపీలో చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో శుక్రవారం తిరుపతి జిల్లాకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురందేశ్వరి కండువాలను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. తిరుపతి జిల్లా సత్యవేడు అసెంబ్లీ కన్వీనర్ మునిస్వామి ఆధ్వర్యంలో పిచ్చాటురు మండలం మాజీ వైస్ ఎంపీపీ బొరందూరు పద్మనాభం, రామాపురం మాజీ ఎంపీటీసీ కన్నిగాన్ వడివేలు, వేలూరు గ్రామ మాజీ సర్పంచ్ పల్లా శేఖర్, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర గజేంద్ర తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

పీడీజే సునీత


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు పోలీస్, ఎక్సైజ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అర్హమైన కేసులు అధిక సంఖ్యలో పరిష్కారం కావడానికి ఇరు పక్షాలకు జాతీయ లోక్ అదాలత్ గురించి తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, కోనసీమ ఈఎస్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్ర సాద్, తూర్పుగోదావరి అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్సా పథకాలపై నేడు వర్క్‌షాప్

జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) పథకాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా శనివారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో కార్యశాల నిర్వహిస్తున్నామని కార్యక్రమ సమన్వయకర్త, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి జీజీయూలో జాతీయ సెమినార్

రాజానగరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వికసిత్ భారత్ ఎట్ ది రేట్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణలను ఉపయోగించడం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఇక్కడి విలేకరులకు వివరించారు. జీజీయూలో 28,29 తేదీల్లో జరిగే ఈ సెమినార్‌లో నీతి అయోగ్ సభ్యులు విజయకుమార్ సరస్వతి, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) చైర్మన్ ఆచార్య టీజీ సీతారాం, బయోటెక్నాలజీ పరిశ్రమ పరిశోధన సహాయ మండలి(బైరాక్) మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్రకుమార్, ఐసీఎంఆర్ అడిషనల్ డైరెక్టర్ సంఘమిత్ర పాటి, అఖిల భారత ఆయుర్వేద సంస్థ డైరెక్టర్ తనూజ నేసారి, సీఎస్ఐఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ డైరెక్టర్ రామానుజ నారాయణ తదితర ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన దాదాపు 50 మందికి పైగా ప్రతినిధులు విచ్చేసి వివిధ అంశాలపై ఉపన్యసిస్తారన్నారు. బోధన, పరిశోధన, పారిశ్రామిక రంగాల నుంచి దాదాపు 250 మంది సెమినార్‌కు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో జీజీయూ వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ఎం.శ్రీనివాసరావు, పరిశోధన సలహాదారు శిశిర్ సాహా, డైరెక్టర్ టీవీ ప్రసాద్, యూనివర్సిటీ ప్రాంగణంలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఒకే రకమైన మెరైన్ యాక్ట్‌ను అమలు చేయాలి

విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో విస్తరించియున్న సముద్ర తీర ప్రాంత రాష్ట్రాలన్నింటికి ఒకే రకమైన మెరైన్ యాక్ట్‌ను అమలు చేయాలని విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మత్స్యశాఖ కమిషనర్ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్ట్-1994, దాని నిబంధనల నవరణ నిమిత్తం సలహాలు, సూచనలు స్వీకరించేందుకు కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ(ఎస్ఐఎఫ్ఈటీ)లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అంజలి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, ఏపీ ఫిష రీస్ యూనివర్శిటీ ప్రతినిధులు, వివిధ జిల్లాల మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.విశాఖపట్నం నుంచి సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ ముక్త, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్, ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త ప్రసాద్, నెట్ ఫిష్ స్టేట్ కో-ఆర్డినేటర్ హనుమంతరావు, శాస్త్రవేత్త ప్రభంజన్‌కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజలి మాట్లాడుతూ వర్తమానం, భవిష్యత్తులో రాబోయే మార్పుల దృష్ట్యా ఈ యాక్ట్‌లో సవరణలు చేయడానికి సలహాలు, సూచనలివ్వాలని కోరారు. శాస్త్రవేత్తలు, మత్స్య శాఖ అధికారులు మాట్లాడుతూ ఏపీ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయడంలో సవాళ్లను అధిగమించాలన్నారు. సంప్రదాయ మత్స్యకారులకు రిజర్వ్ చేయాల్సిన సముద్ర జలాలు, వివిధ రకాల బోట్లు పొడవు, ఇంజన్ సామర్థ్యం తదితర అంశాలపై సూచనలు చేశారు.

వాడపల్లి వెంకన్నకు 3 టన్నుల కూరగాయలు


సీతానగరం నుంచి కూరగాయలను పంపుతున్న దృశ్యం

సీతానగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వాడపల్లి వెంకన్న ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నుంచి శుక్రవారం 3 టన్నుల కూరగాయలు విరాళంగా పంపించారు. అక్కడ ఆలయంలో జరుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో సీతానగరం మండల ప్రజలు సమష్టిగా 3టన్నుల కూరగాయలు సమకూర్చి శుక్రవారం పంపించారు. కార్యక్రమంలో పలివెల వీరబాబు, కోసూరి త్రిమూర్తులు, సింగవరం సర్పంచ్ సంగన పోశియ్య, పోలినాటి నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరం

- పోలవరం ఎత్తు తగ్గించి అన్యాయం చేశారు
- యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్రాభివృద్ధిపై లేదు
- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి



రాజమహేంద్రవరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరమని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిళారెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం షర్మిళారెడ్డి, ఏపీ సీసీ ఇన్‌చార్జి పాలక్ వర్మతో కలిసి రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కృష్ణసాయి కళ్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో షర్మిళారెడ్డి మాట్లాడారు. రాష్ట్రాన్ని బీజేపీ దారుణంగా మోసం చేసిందన్నారు. విభజన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి మోసం చేశారన్నారు. 45మీటర్ల నుంచి 41కి ఎత్తు తగ్గిస్తే అది ప్రాజెక్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోదీకి ఊడిగం చేస్తున్నారని, పార్టీలన్నీ గులాం గిరి చేస్తున్నాయన్నారు. విభజన హామీల్లో ఒకటైన రాజధానిని కేంద్రమే నిర్మించి ఇవ్వాలని, కాని అప్పు ఇచ్చిందన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి యోగా చేసి ప్రధాని వెళ్లిపోయారని, యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు.రానున్న నాలుగేళ్లు అత్యంత కీలకమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా పర్యటనలు, విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పీసీసీ చీఫ్‌కు ఘనస్వాగతం.. రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళారెడ్డికి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి షర్మిళ నివాళుల ర్పించారు. ఆపై సీతంపేట వాటర్ ట్యాంక్‌ల వరకు గుర్రంబండిపై ఊరేగింపు జరిపారు.అక్కడ రాజీవ్‌గాంధీ పార్కులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐసీసీ నేత గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, డాక్టర్ వడయార్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో!

- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనా
- ఎటూ తేల్చని ప్రభుత్వం
- ఇంటర్ ఫలితాలు వచ్చి ఇప్పటికే రెండు నెలలు
- పలు ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ముందస్తు చేరికలు
- ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయే అవకాశం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి రెండు నెలలు కావస్తోంది. అయితే డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రకియ ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలనే విషయంపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ప్రవేశాలపై అధికారిక ప్రకటన రాకుండానే ప్రైవేటు కళాశాలలు ముందస్తుగానే విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో తమ కళాశాలనే ఎంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఫలితం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు మిగిలిపోయే అవకాశం ఉంది. నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియట్లేదు. ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. డిగ్రీలో మాత్రం అందుకు విరుద్ధంగా వుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీ విద్యను అస్తవ్యస్తం చేయడం, ఆన్‌లైన్ ప్రక్రియలో ప్రవేశాలతో సృష్టించిన గందరగోళంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు దానిని సరిచేసే పనిలో ఉన్న ఉన్నత విద్యాశాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సమయం అధికంగా తీసుకోవడంతో దాని ప్రభావం డిగ్రీ ప్రవేశాలపై పడింది. ప్రవేశాలను ఎప్పటికి ప్రారంభిస్తారనే విషయాన్ని ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోతున్నారు.

అస్తవ్యస్తం ఆన్‌లైన్ విధానం

కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురంల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి దాదాపు మూడు రెట్లు అదనంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా సీట్లు ఉన్నాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి గతం నుంచీ అమల్లో ఉన్న విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చివేసింది.




పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

2022-23 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఫలితంగా ప్రవేశాల్లో తీవ్ర గందరగోళానికి దారితీసింది. అప్పటిదాకా జూన్ నెలాఖరుకు పూర్తయ్యే ప్రవేశాలు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు గానీ పూర్తి కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు భారీగా మిగిలిపోయాయి. దీంతో మరలా ఆఫ్‌లైన్ విధానం అమలు చేయాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎటూ తేలని సబ్జెక్టు విధానం

డిగ్రీలో ఉన్న విద్యా విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం మార్చివేసింది. అప్పటివరకు అమలులో ఉన్న మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేసి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేసింది. దీనికి అనుగుణంగా అన్ని రకాల సబ్జెక్టులను ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉంచకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు మొగ్గుచూపడం ప్రారంభించారు. ఈ విధానం సరిగా లేదని భావించిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేస్తామని ప్రకటించినా ప్రభుత్వం నిలిపివేయాలని ఆదేశించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచించింది. అందుకనుగుణంగా సింగిల్ మేజర్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలు గురించి ఉన్నత విద్యా మండలి సవివరంగా ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

నెలకు పైగా సాగే ప్రక్రియ



ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకు పైగా సాగుతుంది. గతంలో ఇందుకు రెండు నెలల సమయం తీసుకున్నారు. ఇప్పటి దాకా ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో పాటు ఏ విధంగా అడ్మిషన్లు జరపాలన్న దానిపై నిర్ణయం తీసు కోలేదు. ఆన్‌లైన్‌లో అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కళాశాలలు, కోర్సులు ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, తర్వాత ప్రవేశాలు జరగాల్సి ఉంటుంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి. ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యేసరికి ఆగస్టు నెల వస్తుందని చెప్తున్నారు. ఆఫ్‌లైన్‌లో అయితే మొత్తం ప్రకియను 15రోజుల్లో పూర్తి చేసి తరగతులు ప్రారంభించే వీలుంటుంది.

విద్యార్థులు ఇప్పటికే అటువైపు

అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని తమ కళాశాలల్లో వారిని అనధికారికంగా చేర్చుకోవడంతో పాటుమార్కుల జాబితాలు, టీసీ, ఇతర సర్టిఫికెట్లను వారి వద్ద ఉంచుకున్నాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరినవారిని దరఖాస్తు చేయించి తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. దీనివల్ల ప్రైవేటు కళాశాలలకు అధిక ప్రయోజనం కలుగుతుండగా, ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పూర్తిగా నిండట్లేదు. గత రెండు సంవత్సరాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పలు సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ప్రవేశాల్లో ఇంకా జాప్యం జరిగితే ఇదే పరిస్థితి ఈ ఏడాదీ కొనసాగే అవకాశముంది. ప్రభుత్వం స్పందించి ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించడంతో పాటు సింగిల్ లేదా డబుల్ మేజరు సబ్జెక్టులపై త్వరగా తుది నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.


ఆలమూరులో కానిస్టేబుల్ బ్లైసన్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

కానిస్టేబుల్ బ్లైసన్‌కు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, సిబ్బంది

ఆలమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.బ్లైసన్ అంత్యక్రియలు ఆలమూరులో శుక్రవారం పోలీస్ అధికార లాంఛనాలతో జరిగాయి. గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్లైసన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం బ్లైసన్ ఇంటి వద్ద ప్రారంభమయ్యాయి. ముందుగా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు, ఆలమూరు ఏఎస్ఐ సూర్యచంద్రరావుతోపాటు రావులపాలెం సర్కిల్ పరిధిలోని పలువురు సిబ్బంది బ్లైసన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బ్లైసన్ (ఫైల్)

తర్వాత మృతదేహాన్ని ఊరేగింపుగా గోదావరి గట్టుకు కన్నీటి వీడ్కోలుతో తరలించారు. అక్కడ పోలీస్ అధికార లాంఛనాలతో గాలిలోకి కాల్పులు జరిపి పోలీసు వందనం చేసి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

సామర్లకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంటూరి దుర్గేష్ గురువారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులకు తాళలేక దుర్గేష్ ఇలా చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం మాధవపట్నంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం సాయంత్రం నాటికి అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు చెప్పారని దుర్గేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. అమలాపురానికి చెందిన దుర్గేష్ ప్రస్తుతం కాకినాడలోని జగన్నాథపురంలోని అత్తవారింట నివాసం ఉంటున్నాడు. విజయవాడ పిటి వారెంట్‌కి వెళ్లి తిరిగొచ్చి రెస్ట్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు వీకె.రాయపురం బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న దుర్గేష్‌ను చూసిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వీకె. రాయపురం వెళ్లి మాధవపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దుర్గేష్

అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కంటైనర్ లారీని బొలేరో వ్యాన్ ఢీకొని డ్రైవర్, మహిళ మృతి

డ్రైవర్ సొంతూరు కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం

కశింకోట (అనకాపల్లి జిల్లా), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జమాదులపాలెం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న కంటెయినర్ లారీని వెనుక నుంచి వస్తున్న బొలేరో వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో మహిళతో సహా ఇద్దరు మృతిచెందారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన కన్నూరు లక్ష్మి(40), అనకాపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన ఎస్.వరలక్ష్మి గాజువాకలో పూల వ్యాపారం చేస్తుంటారు. ఇందుకోసం తూర్పుగోదావరి జిల్లా రాజమహేం ద్రవరంలో హోల్‌సేల్‌గా పూలు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. గురువారం కూడా ఇద్దరూ కలిసి రాజమహేంద్రవరం వెళ్లి పూలు కొనుగోలు చేశారు. తిరిగి రావడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రావులపాలెం నుంచి దొండ కాయల లోడుతో అనకాపల్లి వైపు వస్తున్న బొలేరో వ్యాన్‌లో ఎక్కారు. ఇదే జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ (25) వ్యాన్ డ్రైవ్ చేస్తున్నాడు. మహిళలిద్దరూ డ్రైవర్ పక్కన క్యాబిన్‌లో కూర్చున్నారు. వ్యాన్ గురువారం అర్ధరాత్రి 1.45 గంటలకు కశింకోట మండలం జామాదుల పాలెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఇంజన్‌తో సహా వ్యాన్ ముందుభాగం పూర్తిగా కంటైనర్ లారీ కిందకు దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ సత్యనారాయణ, కన్నూరు లక్ష్మి వ్యాన్ శకలాల్లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందారు. వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అన కాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కన్నూరు లక్ష్మి భర్త వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు చెప్పారు.


సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

కాలు జారి చెరువులో పడి వ్యక్తి మృతి

ముమ్మిడివరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బహిర్భూకి వెళ్తూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతిచెందాడు. కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన సబ్బతి అంబేడ్కర్ (37) భార్య గంగాభవానీతో కలిసి 2 రోజుల క్రితం ముమ్మిడివరం నగర పంచాయతీ వృద్ధ గౌతమీ మురుగుకాల్వ పక్కన రాజుపాలెంలో తన తోడల్లుడు గోడ కృష్ణ కాపలా ఉంటున్న చెరువుల వద్దకు వచ్చాడు. శుక్రవారం ఉదయం బహిర్భూమికి బయలుదేరిన అంబేడ్కర్ ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కృష్ణ, అక్కడి వారు వెతగ్గా చెరువులో అంబేడ్కర్ మృతదేహం లభ్యమైంది. గంగాభవానీ ఫిర్యాదుతో ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


మరణించిన ఎస్.అంబేడ్కర్

విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింట్ పరిశీలన

తొండంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింటును శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు సీహెచ్.భాస్కరరావు పరిశీలించారు. కాకినాడ జిల్లా తొండంగి ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింటులో రికార్డులు తనిఖీ చేశారు. యూనిఫాం, బూట్లు, సాక్సు పరిశీలించారు. ఎప్పుడు వచ్చిన సరుకును అప్పటికప్పుడు పాఠశాలలకు పంపించాలని సూచించారు. మెగా పేరెంట్స్ డే జరిగే జూలై 5 నాటికి ప్రతి విద్యార్థి యూనిఫాంతో హాజరయ్యే విధంగా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అందరికి పాఠ్యపుస్తకాలు అందాయాలేదా అన్నది ఆరా తీసారు. ఏఎంవో చామంతి నాగేశ్వరావు, తొండంగి ఎంఈవో 2 సుబ్బిరెడ్డి, యు.కొత్తపల్లి ఎంఈవో 2 పైడిరాజు, సీఆర్పీలు ఉన్నారు.



తొండంగిలో షూలు పరిశీలిస్తున్న భాస్కరరావు

విజయవాడ దుర్గమ్మకు

అన్నవరం తరుపున సారె, చీర

అన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సోదరిగా విరాజిల్లుతున్న విజయవాడ కనకదుర్గకు శుక్రవారం అన్నవరం దేవస్థానం తరుపున ఈవో సుబ్బారావు దంపతులు ఆషాఢం సారె, చీరలను అందించారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం నుంచి వెళ్లిన పండితులకు, అధికారులకు అక్కడ ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. సత్యదేవుడి కల్యాణోత్సవాలకు విజయవాడ దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, దసరా నవరాత్రులలో అన్నవరం దేవస్థానం నుంచి అక్కడికి పట్టువస్త్రాలను పట్టుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.


విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఆషాఢం సారెను తీసుకెళ్తున్న అన్నవరం ఆలయ ఈవో దంపతులు

తలుపులమ్మకు ఆషాఢం సారె సమర్పణ

తుని రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసోత్సవాలు పురస్కరించుకుని తొలి శుక్రవారం కాకినాడ జిల్లా తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానంలో సారె సమర్పించే కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ఆచారం ప్రకారం తుని రాజవంశీయులు ఎస్ఆర్‌వీ శ్రీనివాసరాజు, పృథ్వీరాజు, రమేష్ రాజు కుటుంబాలు తరలివచ్చి అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించారు.


అమ్మవారికి సారె తీసుకొస్తున్న రాజవంశీయులు


తలుపులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శోభాయమానంగా..

రాజమహేంద్రవరంలో జగన్నాథస్వామి రథయాత్ర, తరలివచ్చిన భక్తజనం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం వేలాది మంది భక్తులతో జగన్నాథస్వామి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్రలో శ్రీజగన్నాథ బలదేవ సుభద్రల మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విచ్చేసి హారతిచ్చారు. వారికి ఇస్కాన్ మందిర కమిటీ ముఖ్య సభ్యుడు సత్యగోపీనాథ్ దాస్ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రథయాత్రకు శ్రీకారం చుట్టారు. వేలాది మంది భక్త పారవశ్యంతో రథాన్ని లాగారు. కోలాట భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కీర్తనలుతో కనుల పండువగా రథయాత్ర సాగింది.



దేవీచౌక్ వద్ద జగన్నాథస్వామి రథయాత్ర దృశ్యం


రథయాత్ర ఆచారంలో భాగంగా..


రథయాత్రలో సాంస్కృతిక ప్రదర్శనలు

వేంకటేశ్వరస్వామి వేషధారణ

సత్యదేవుడి సన్నిధిలో టిడ్కో చైర్మన్ పూజలు


టిడ్కో చైర్మన్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో స్వామివారి ప్రసాదం అందించారు.

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. అమ్మవారికి చండీ,సప్తపారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలోను గంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలందించారు.

ఏపీ పీజీ సెట్‌లో ‘ఆదిత్య’ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కాకినాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్-2025 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు లభించినట్టు డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. వివిధ సబ్జెకుల్లో 10లోపు 11 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో గణితంలో 1, 3, 5, 5, 8, కంప్యూటర్ సైన్స్‌లో 3, 8, 10, గణాంక శాస్త్రంలో 9, ఎలక్ట్రానిక్స్‌లో 4, 5 ర్యాంకులు సాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

23 కిలోల గంజాయి, కారు స్వాధీనం

కాకినాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం వసంతనగర్‌లో కారులో తరలిస్తున్న 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గు రిని అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసకుమార్, డీటీలు సిబ్బందితో కూడిన బృందం దాడి చేసి చల్లా నాగశివ మణికంఠ, మద్దాల ఉదయకుమార్, ఏనుగుపల్లి రాజుల వద్ద 23 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పలు కేసుల్లో వారి ప్రమేయం ఉందన్నారు. ముగ్గురు నిందితులు జ్యూడీషియల్ కస్టడీకి రిమాండ్ చేయగా తప్పించుకున్నాల్గో నిందితుడిని పట్టుకునేందుకు చర్యలు కొనసాగుతున్నాయని సీఐ బి.పెద్దిరాజు పేర్కొన్నారు.


గంజాయి రవాణా చేస్తూ కారుతో పట్టుబడిన నిందితులు

మన్యంలో ముసురు

మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో నేలకూలిన భారీ వృక్షం

మోతుగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముసురు ప్రభావంతో అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో రెండు రోజులుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. విద్యార్థులు, నిత్య కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆర్అండ్‌బీ రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో వాహనదారుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు చేరుకుని చెట్టును పక్కకు తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మోతుగూడెం మన్యంలో వాగులు, జలపాతాలు ఊపిరి పోసుకున్నాయి.


నేలకూలిన భారీ వృక్షం

బొజ్జా తారకం జయంతి

ముమ్మిడివరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన యోధుడు బొజ్జా తారకమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ పేర్కొన్నారు. స్థానిక పోలమ్మ చెరువుగట్టు బుద్ధ పార్కు ఆవరణలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బొజ్జా తారకం 86వ జయంతి నిర్వహించారు.

అమలాపురం

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ
- ముమ్మిడివరం కౌన్సిల్ సమావేశం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా దోమలు పెరిగిపోతున్నాయి.. ఫాగింగ్ చేయడం లేదు.. డ్రైనేజీల్లో ఎంఎల్ ఆయిల్ పిచికారీ చేయడం లేదు.. గత సమావేశాల్లో దోమల నిర్మూలన అంశాన్ని చర్చకు తీసుకువచ్చాం కదా.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ కమిషనర్ టి.రవివర్మను నిలదీశారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆయిల్ బిల్లులు చెల్లింపు పెండింగ్‌లో ఉండడం వల్ల దోమల నిర్మూలనా చర్యలు చేపట్టలేకపోయామని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజీవ్ సంజాయిషీ ఇవ్వగా అత్యవసర పనుల కింద నిధులు కేటాయించి ఆ పనులు పూర్తి చేయాలని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కమిషనర్‌ను ఆదేశించారు. నేషనల్ హైవే పక్కన వెంచర్లు వేసేవారు మురుగునీరు, పంట బోదెలను ఆక్రమించి వాటిని కప్పేస్తున్నారు, వాటిని తూరలు కూడా ఏర్పాటు చేయడం లేదు, దీని వల్ల వర్షం వస్తే ముంపు సమస్య తలెత్తుతుందని, వరి పొలాల్లో నీరు దిగక రైతులు ఇబ్బంది పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ములపర్తి బాలకృష్ణ సూచించారు. దీనిపై చైర్మన్ స్పందించి మళ్లీ కౌన్సిల్ సమావేశం నాటికి అనథరైజ్ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. కమిషనర్ స్పందించి రెవెన్యూ, డ్రెయిన్లు, ఇరిగేషన్ శాఖలను సమన్వయ పరుచుకుని ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముమ్మిడివరం-అయినాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు పెద్దపెద్ద గోతులు పడి వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని, కనీసం ఆ గోతుల్లో నీరు బయటికి వెళ్లేలా మార్గాం ఏర్పాటు చేయాలని, మాగాం-అయినాపురం గుర్రపుడెక్క నిండిపోయిందని, దాని తొలగింపు చర్యలు చేపట్టాలని కౌన్సిల్ అడబాల సతీష్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జంగిల్ క్లియరెన్సు చేస్తాం, వీధి దీపాలు వేస్తాం, శానిటేషన్ నిర్వహిస్తామని ప్రతీ సమావేశంలోను అంటున్నారు, పనులు మాత్రం చేపట్టడం లేదని 7వ వార్డు కౌన్సిలర్ గంజ శ్రీనివాస్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అగ్రహారం బాడవలో లేఅవుట్ వేస్తున్న వారు కొబ్బరి చెట్లను తొలగించి రోడ్డు పక్కన పడవేయడంతో ఆ రోడ్డంతా ఛిద్రంగా మారిందని కౌన్సిలర్ గంజా శ్రీనివాస్ అన్నారు. చిప్పలపాలెంలో తొమ్మిది ఎకరాల చెరువు ఉండగా నాలుగు ఎకరాలు ఆక్రమణలకు గురైందని, చెరువు చుట్టూ ఉన్న కొబ్బరిచెట్లను కూడా ఆక్రమించుకున్నారని, సర్వే చేసి వాటిని స్వాధీనం చేసుకుంటే నగర పంచాయతీకి రెండు, మూడు లక్షల ఆదాయం చేకూరుతుందని ఆ వార్డు కౌన్సిలర్ సరిపెల్ల రామకృష్ణంరాజు సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీకి బదిలీపై మహిళా ఉద్యోగులు రావడానికి భయపడుతున్నారని, బదిలీపై వచ్చిన ఒక మహిళా ఉద్యోగిని చేరడంలో ఒక కౌన్సిలర్ భర్త ఆమెను వేధింపులకు గురిచేసినట్టు మీడియాలో వచ్చిన వార్తపై వైస్ చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తోటి మహిళా కౌన్సిలర్లు కూడా మహిళా కౌన్సిలర్ భర్త వైఖరిని ఖండించారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ స్పందించి మహిళా ఉద్యోగిణి వేధింపులను తామెవరూ సమర్థించమని, వచ్చిన ఆరోపణను వారు ఖండించారు. నగర పంచాయతీలో రోడ్ల అధ్వాన పరిస్థితిపై ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు కోరారని, రూ.4కోట్లు పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ఇవ్వడం జరిగిందని, అవి మంజూరైతే కొంత వరకు రోడ్ల సమస్య పరిష్కారమవుతుందని ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ టి.సుభాష్, వైస్‌చైర్మన్లు వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమసుందరి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుదుచ్చేరిలో బీజేపీ దిద్దుబాటు చర్యలు!

- మంత్రి, ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేల రాజీనామా
- కొత్తవారికి అవకాశం!


మంత్రి సాయిసార్వణన్ , నామినేటెడ్ ఎమ్మెల్యేలు

యానాం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో రాజకీయం వేడెక్కుతోంది. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. దీనిలో భాగంగానే ఒక మంత్రితో పాటు ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారు. ముఖ్యంగా పుదుచ్చేరిలో ఉన్న ముగ్గురు బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యేలు రామలింగం, అశోక్‌బాబు, వెంకటేశన్‌లు రాజీనామా లేఖలను స్పీకర్‌కు అందజేశారు. అలాగే ఆదిద్రావిడ శాఖ మంత్రి సాయిసార్వణన్ రాజీనామ లేఖను సీఎం రంగసామికి అందజేశారు. సీఎం రంగసామి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుత అంశాలపై వారు చర్చించారు.అనంతరం సీఎం రంగసామి మీడియాతో మాట్లాడుతూ మంత్రి సాయిసార్వణన్ రాజీనామను గవర్నర్ ఆమోదం తెలిపారన్నారు. నామినేటెడ్ ఎమ్మెల్యేల రాజీనామాలపై వ్యాఖ్యానించనని సీఎం అన్నారు. ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేల రాజీనామాలను అసెంబ్లీ స్పీకర్ ఆమోదం తెలిపినట్లు అసెంబ్లీ కార్యదర్శి జె.దయాలన్ ఉత్తర్వులు జారీచేశారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా రాజీనామాల అంశాలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. మంత్రి పదవికి బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే జాన్‌కుమార్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. నామినేటెడ్ ఎమ్మెల్యేల విషయంలో బీజేపీ ఇన్‌చార్జ్ సూరానా పుదుచ్చేరి చేరుకుని బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యనిర్వాహకులతో సమావేశమయ్యారు. మరో రెండు రోజుల్లో కొత్త మంత్రి, నామినేటెడ్ ఎమ్మెల్యే పేర్లు అధికారికంగా వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఎంపీ సతీష్‌ను కలిసిన శిరిగినీడి

అంబాజీపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌ను నీటి పారుదల శాఖ డైరెక్టర్, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిశారు.



నేడు జాబ్‌మేళా

పి.గన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రేస్ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొంటాయన్నారు. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 400పైగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఎమ్మెస్సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బి-టెక్, ఎంబీఏ, ఎంకామ్ చదివిన వారు అర్హులన్నారు.

విద్యార్థుల చేరికలు పెంచాలి

ఉప్పలగుప్తం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలుపెరిగేలా ఉపాధ్యాయులు కృషి చెయ్యాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ సూచించారు. శుక్రవారం భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్రాపవుట్లను గుర్తించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. స్వయంగా ఆమె విద్యార్థులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష బాలికా సంరక్షణ అధికారి ఎంఎకె భీమారావు, హెచ్ఎం నూకల సత్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో అంగన్‌వాడీలకు మేలు

రాజోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు మేలు చేసింది కూటమి ప్రభుత్వమేనని అంగన్‌వాడీ పార్లమెంటరీ అధ్యక్షురాలు మోకా పార్వతి అన్నారు. రాజోలులో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4,687 అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారతాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.

గెయిల్ ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకుంటా


అశువులు బాసిన మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు

మామిడికుదురు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామంలో 11ఏళ్ల క్రితం జరిగిన గెయిల్ పైపులైను పేలుడులో బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరం గ్రామంలో శుక్రవారం మృతిచెందిన వారికి ఘన నివాళులర్పించారు. మృతిచెందిన వారికి గుర్తుగా నిర్మించిన స్మారక స్థూపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేలుడు సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించడం అన్యాయమన్నారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మృతుల పేరిట స్మారక స్థూపం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జనసేన, టీడీపీ, బీజేపీ మండల శాఖల అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజా, బోనం బాబు, బైరిశెట్టి దుర్గారామకృష్ణ, నాయకులు జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్, మొల్లేటి పార్వతి, వానరాశి ప్రసాద్, గాడి సత్తిబాబు, కల్వే అబ్బాస్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, సర్పంచ్ జాలెం రమణకుమారి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

మలికిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో జూలై 19, 20, 21 తేదీల్లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం దిండిలో గెద్దం ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన రాజోలు నియోజకవర్గ సీపీఐ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, 18ఏళ్లు నిండిన మహిళలకు భృతి, పేదలకు మూడు సెంట్ల భూమి, పట్టణాల్లో రెండు సెంట్ల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతో పార్టీ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. రాజోలు నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి పార్టీ సభలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో దేవ రాజేంద్ర ప్రసాద్, చెల్లుబోయిన తాతారావు, దేవ నాగభూషణం, మేడిచర్ల సత్యనారాయణ, చిట్టిరాజు, ఆనంద్, నాగేశ్వరరావు, రాజబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వెంకటరమణ పూజలు

అంతర్వేది, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఏలూరు జిల్లా కైకలూరు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శుక్రవారం విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయ దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ ఎమ్మెల్సీకి అందించారు.

పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి

- హైమాస్ట్ పోల్స్ ఏర్పాటులో అవకతవకలు
- అధికారులపై మండిపడ్డ కౌన్సిలర్లు


చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హైమాస్ట పోల్స్ ఏర్పాటులో అవకతవకలు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్ కొటేషన్లు ఇవ్వడం ఏమిటని అధికార పక్ష వైసీపీ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ప్రశ్నించారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, తాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఇంజనీరింగ్ అధికారులు నీళ్లు నమిలారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. అధికారుల తీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సూచించారు. పట్టణంలోని డివైడర్లను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా భవిష్యత్తులో చేపట్టనున్న డివైడర్ల అభివృద్ధి సుందరీకరణ గురించి కాదని, ప్రస్తుతం ఉన్న వాటిని అభివృద్ధి చేయాలని కౌన్సిలర్ దొమ్మేటి రాము సూచించారు. పట్టణంలో అపారిశుధ్యం తాండవిస్తోందని దీనివల్ల కౌన్సిలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందని రాజేష్ విమర్శించారు. పన్నులు కడుతున్నా సక్రమంగా తాగునీరు ఇవ్వడం లేదని, వార్డుల్లో కౌన్సిలర్ల అసమర్థతగా చూస్తున్నారని కౌన్సిల్ తిక్కా సత్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి ట్యాంకర్లు సక్రమంగా తిరగడం లేదని, 15 రోజులుగా 6వ వార్డులో మంచినీటి సరఫరా లేదని కౌన్సిలర్ పిండి అమరావతి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ఫోన్లు చేస్తున్నా పట్టించుకోవడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. మున్సిపల్ డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో 60వేల మంది జనాభా ఉన్నారని, వారికి రోజుకు 80లక్షల లీటర్ల నీరు అవసరం కాగా ప్రస్తుతం 51లక్షల నీటిని మాత్రమే అందిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.20కోట్ల అంచనా వ్యయంతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, పైపులైన్లు, ఇతర పనులకు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క ట్యాంకు నిర్మాణం మాత్రమే పూర్తయిందని, మిగిలిన ట్యాంకులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అయితే ఆ ట్యాంకులకు అవసరమైన నీటిని సరఫరా చేయగలరా అన్న ప్రశ్నకు సరఫరా చేయలేమని అధికారులు బదులు ఇవ్వడం విశేషం. హైమాస్ట పోల్స్ ఏర్పాటులో జరుగుతున్న అవకతవకలను కౌన్సిలర్ రాజేష్ కౌన్సిల్ ముందు ఉంచారు. ఎస్టిమేట్‌లో చూపిన విధంగా కాకుండా ఇంజనీరింగ్ అధికారులు 50అడుగుల పోల్స్‌ను ఏర్పాటుచేసిన తీరును వివరించారు. ఏఒక్క అంశానికి ఇంజనీరింగ్ అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. డిజైన్ లేకుండా అభివృద్ధి పనికి టెండర్లు పిలిచిన తీరుపై కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి లైట్ల నిర్వహణకు రూ.32లక్షలు కేటాయిస్తే మూడు నెలల క్రితం కాంట్రాక్టరుకు అగ్రిమెంటు, వర్కు ఆర్డరు ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఒక్క బల్బు కూడా వేసిన పాపాన పోలేదని కౌన్సిలర్లు మండిపడ్డారు. నిబంధనల మేరకు ఇప్పటికే రూ.16లక్షల మేర వీధి లైట్ల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. చిన్నపాటి రోడ్డుకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేరు పెట్టడం ఏమిటని, ప్రతిష్టాత్మకంగా ఈదరపల్లిలో నిర్మిస్తున్న వంతెనకు ఆనందరావు పేరును పెట్టాలని ఆయన సూచించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నా ఇంత వరకు డ్రైన్లలో సిల్టు పనులు చేపట్టలేదని కౌన్సిలర్ పడాల శ్రీదేవి కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. డీసిల్టింగ్ పనులకు రూ.39లక్షలు నిధులు కేటాయించినట్టు కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ వివరించారు. ఇంత వరకు ఎక్కడా సిల్టు పనులు చేయని తీరుపై అధికార, విపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. ప్రస్తుత పాలకవర్గ హయాంలో కమిషనర్లు, ఇతర అధికారులు మారుతున్నారు తప్ప ఏ ఒక్క సమస్య తీరడం లేదని వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పలు అంశాలను సభ్యులు యేడిద శ్రీను, బండారు గోవిందు, యండమూరి గంగ, పిండి అమరావతి, గండి దేవిహారిక తదితరులు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు.

అనేక పథకాలు ప్రవేశపెట్టిన పీఎం మోదీ

రాజోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టారని మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా అన్నారు. కడలిలో వడ్లమూడి ప్రకాశరావు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 11సంవత్సరాల సుపరిపాలన దినోత్సవంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా వేమా పాల్గొని మాట్లాడుతూ మోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. మరో ముఖ్య అతిథి బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడారు. మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాధిక్, కడలి నీటిసంఘం ఉపాధ్యక్షుడు ఆకుమర్తి వెంకటేశ్వరరావు, కుసుమ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ 132కేవి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు కారణంగా యానాంలో నియోజవర్గంలో శనివారం ఉదయం 8నుంచి 2గంటల వరకు సరఫరా అంతరాయం కలుగుతుం దని ఏఈ ఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు.

ప్రొటోకాల్‌పై రగడ

యానిమేటర్ల దందాలపై సభ్యుల ఆగ్రహం


మండల పరిషత్ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించని అంశంపై సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులకు డబ్బులు ఇవ్వాలంటూ డ్వాక్రా యానిమేటర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మితో సహా అధికార, విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. పలు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదని సభ్యులు అడపా సత్తిబాబు, అడపా సుబ్రహ్మణ్యం, పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. భట్నవిల్లిలో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీలకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఏఈ చినబాబును ప్రశ్నించారు. కాంట్రాక్టరు చెబుతారన్నట్టు తప్పించుకోగా కార్యదర్శి రెడ్డి శిరీషను ప్రశ్నించారు. ఇదేతరహాలో పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను పట్టించుకోవడంలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా యానిమేటర్ల అక్రమ వసూళ్లపై ఎంపీపీ భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. డ్వాక్రా సంఘాల్లో ప్రతీ పనికి ఓ రేటు పెట్టేశారని, దీనికి ఏం సమాధానం చెబుతారని ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బరామ్, దొంగ ఆంజనేయులు, సునీతతో పాటు బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత జత కలిశారు. యానిమేటర్ల అక్రమ వసూళ్లపై ఏపీఎం సత్యనారాయణను నిలదీశారు. అంగన్‌వాడీలకు డీఆర్డీఏ ద్వారా నిధులు ఏమైనా కేటాయించారా అని సర్పంచ్ సునీత ప్రశ్నించగా సీడీపీవో రమాదేవి కల్పించుకుని సమాధానమిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలవద్ద కిచెన్ గార్డెన్ల నిర్మాణం కోసం రూ.10 వేలు వంతున ప్రభుత్వం వీవోల ఖాతాలో నగదు జమ చేసినట్టు వివరించారు. కిచెన్‌గార్డెన్ల ఏర్పాట్లను యానిమేటర్లు పర్యవేక్షించాల్సి ఉందన్నారు. ఎంత కాలం క్రితం నగదు జమ చేశారని సభ్యులు ప్రశ్నించగా ఆరు నెలల క్రితమే నగదు జమ చేశారన్నారు. ఈవ్యవహారాలపై తక్షణం విచారణ జరపాలని ఏపీఎం సత్యనారాయణకు సూచించారు. వీధి లైట్లు వెలగడం లేదని ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, బూలవారిపేటకు తాగునీరు సరఫరా లేదని ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తోట్లపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి మెట్లు ఏర్పాటుచేయని తీరును ఎంపీటీసీ అంజనేయులు ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దందా నడుస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎంఈవో సరెళ్ల దుర్గాదేవిని నిలదీశారు. కనీసం బ్రిడ్జిల శంకుస్థాపనలకు కూడా ప్రోటోకాల్ పాటించరా అని ఆర్‌అండ్‌బీ ఏఈ రమేష్‌ను ప్రశ్నించారు. రోళ్లపాలెం-ఇమ్మిడివరప్పాడు రోడ్డు అధ్వానంగా మారాయని సర్పంచ్ రేలంగి దుర్గారావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, అంకం హిమబారతి పాల్గొన్నారు.

అందించిన సేవలే గుర్తింపునిస్తాయి

ముమ్మిడివరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అందించిన సేవలు ప్రజల్లో వారికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. స్థానిక నగరపంచాయతీలో శుక్రవారం నగర పంచాయతీ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై సామర్లకోట వెళ్లిన వీవీ నూకరాజు, హెల్త్‌అసిస్టెంట్‌గా పనిచేసి భీమవరం బదిలీపై వెళ్లిన జేఎస్ఎన్ రాజు, రామచంద్రపురం అక్కౌంటెంట్‌గా బదిలీపై వెళ్లిన కె.సుబ్బారావు, ఉద్యోగ విరమణ పొందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కాశి జార్జిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, వైస్‌చైర్‌పర్సన్ రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, అడబాల సతీష్‌కుమార్, సరిపెల్ల రామకృష్ణంరాజు, కౌన్సిలర్లు సచివాలయ, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

మామిడికుదురు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని ఎంపీడీవో జి.భవానీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశానికి రాని ఉద్యోగులకు మెమో ఇవ్వనున్నట్టు తెలిపారు. తహశీల్దార్ పి.సునీల్‌కుమార్, వ్యవసాయాధికారి ఎస్వీవీ సత్యనారాయణ, ఏవో కె.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ హయాంలో సుపరిపాలన

మామిడికుదురు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశంలో సుపరిపాలన జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నారు. మోదీ 11ఏళ్ల సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా మామిడికుదురులో కార్యక్రమం జరిగింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా మాట్లాడారు. ఆయా పథకాలును తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గా రామకృష్ణ, ప్రోగ్రాంమండల కన్వీనర్ మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, వేగి వెంకటేశ్వరరావు, షంషూసాధిక్, సుంకర నాగభూషణం, కోటిపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఆదుర్తికి సత్కారం

అంబాజీపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ అవార్డును స్వీకరించిన తొండవరం హైస్కూల్ పూర్వపు ఉపాధ్యాయుడు ఆదుర్తి వెంకటఅప్పారావును ఎంఈవో మోకా ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. సీఆర్పీలు వెంకటేష్, గోవిందరాజు, నాగరాజు, ఎంఆర్సీ సిబ్బంది శ్రీను, రాజేశ్వరి, రాంబాబు, సూరిబాబు, సూర్యకుమారి పాల్గొన్నారు.

వెలుగు ఉద్యోగి కుటుంబానికి రూ.11లక్షల సాయం

అంబాజీపేట,జూన్27(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మేలో జరిగిన పునః నిర్మాణ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలతో వెళ్లి తిరిగి వస్తుండగా ఏలూరు వద్ద జరిగిన ప్రమాదంలో వెలుగుఉద్యోగి నాగరాజు మృతిచెందగా ఉద్యోగులు, వీవోల ద్వారా సేకరించిన రూ.11లక్షలను గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు టి.సాయినాథ్, జయచంద్రగాంధీ భార్య భారతికి అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారిభూపతివర్మ, ఏపీడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అయినవిల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యుత్‌శాఖ ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఆరోగ్యశాఖ వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం కన్నా 27లక్షల టన్నుల ధాన్యం ఎక్కువ కొనుగోలు చేసిందన్నారు. ఎంపీడీవో జీవీ సరేవర్, తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, డీసీ కాకర శ్రీనివాస్, ఇందుగుల వెంకట్రామయ్య, మేడిద దుర్గాప్రసాద్, నలాది బుచ్చిరాజు, వారా జయసావిత్రి, శీలం వెంకటేశ్వరరావు, కాకర శ్రీనివాస్, గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో

అంబాజీపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు సరఫరా చేసే సమయంలో తూకాలు, నాణ్యత, పరిశుభ్రత చూసుకోవాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. అంబాజీపేటలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను శుక్రవారం ఆయన తనిఖీచేశారు. స్టాక్‌పాయింట్‌లో ఉన్న స్టాక్, రిజిస్టర్లు తదితర వాటిని పరిశీలించారు. తహశీల్దారు చినబాబు, ఆర్ఐ ఏడుకొండలు, ఎంఎస్వో సత్యనారాయణ, వీఆర్వోలు రమేష్, రమణ ఉన్నారు.

ఏపీఎంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

మలికిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల వెలుగు అసిస్టెంట్ మేనేజర్, అక్కౌంటెంట్లపై లక్కవరం క్లస్టర్ వీవోఏలు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలో అన్ని క్లస్టర్లకు అదే క్లస్టర్ వాళ్లను నియమించగా లక్కవరం క్లస్టర్‌కు వేరే వాళ్లను నియమించడంపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎమ్మెల్యే దేవ ఏపీఎంతో మాట్లాడారు. అధికారులు, మహిళా సంఘాల వద్దకు వెళ్లకుండా మహిళలను ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టవద్దని ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో నక్కా సువర్ణ, జి.ప్రమీల, ఎం.రాజకుమారి, ఎం.పెద్దిరాజు, కరిష్మా, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన, దొంతికుర్రు స్లూయిస్‌ల నిర్మాణం

కాట్రేనికోన, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన, దొంతికుర్రు స్లూయిస్‌ల నిర్మాణ పనులు అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్టు ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయానికి వచ్చారు. నీటి సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఏటిగట్టు పనులను సైతం ఈఏడాది అక్టోబరులో ప్రారంభిస్తామన్నారు. ఈఈ కె.వెంకటేశ్వరరావు, అయినాపురం సెక్షన్ ఏఈ పవన్‌కుమార్, నీటి పంపిణీ సంఘం చైర్మన్ ఆకాశం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, నీటి సంఘం చైర్మన్‌లు ఇసుకపట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు గుర్తించాలి

ఉప్పలగుప్తం, జూన్27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని ఎంపీడీవో భూపతిరాజు తులసీకృష్ణ సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను శుక్రవారం ఈవోపీఆర్డీ పీఆర్వీ కుమర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు.

రోటరీ క్లబ్ మలికిపురం అధ్యక్షుడిగా ఫిలిప్‌రాజు

మలికిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ మలికిపురం అధ్యక్షుడిగా మలికిపురానికి చెందిన గెడ్డం ఫిలిప్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మలికిపురం రోటరీక్లబ్ 40ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంది. 2025-26 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా రెండోసారి ఫిలిప్‌రాజును ఎన్నుకున్నారు. కార్యదర్శిగా డాక్టర్ బందెల సంపత్‌కుమార్, కోశాధికారి దొంగ రవిచంద్ర ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్స్ గుబ్బల బాబ్జి, రాపాక విజయారావు, బందెల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

60మంది రక్తదానం

రాజోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంక్ 70 వసంతాలు పూర్తి కాబోతున్న సందర్భంగా బ్యాంకు చైర్మన్ శ్రీనివాసులుశెట్టి పిలుపు మేరకు అమలాపురం యెండూరి బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రాజోలు పరిధిలోని అనుబంధ బ్రాంచీల సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ఖాతాదారులు 60మంది శుక్రవారం రక్తదానం చేశారు. ఈసందర్భంగా రక్తదానం చేసిన వారిని రీజనల్ మేనేజర్ అశోక్ నాగరాజన్ అభినందించారు. సత్యప్రసాద్, వీరభద్రరావు, రజనీకాంత్, కానూరి సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, సూర్యనారాయణ, వర్మ, గణేష్, దుర్గాప్రసాద్, మోహన్, వెంకటరమణ, ప్రవీణ్, బ్రాంచి మేనేజర్ ఎన్ఎస్ఆర్ఎం ప్రసాద్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శంకుస్థాపనలు

అంతర్వేది, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం మండలంలో కైలాశభూమి నిర్మాణానికి స్థానిక గ్రామస్తుల సహకారంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు భూమిపూజ చేశారు. అంతర్వేది దేవస్థానంలో స్థానిక గ్రామస్తులు కైలాశభూమి నిర్మాణానికి సహకరించగా, పల్లిపాలెం అగ్నికుల క్షత్రియ యువ పల్లవసేన కువైట్ సంఘంవారిచే రూ.6లక్షలతో కైలాశభూమి విశ్రాంతి భవన నిర్మాణానికి భూమి పూజలు జరిగాయి.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.16లక్షలు

ఆత్రేయపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,16,499 లభించినట్లు ఉపకమిషనర్,ఈవో నల్లంసూర్యచక్రధరరావు తెలిపారు.

చురుగ్గా వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీనివాస ప్రాంగణంలో రూ.4కోట్లతో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాలమేరకు ఆలయంలో వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా చేపడుతున్న పనులను ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, ఇంజనీరింగ్ అధికారుల బృందం ఆయా పనులను పరిశీలించారు. అన్నదాన భవననిర్మాణం ద్వారా వేలాది మంది భక్తులు సకల సౌకర్యాలతో స్వామివారి ప్రసాదం స్వీకరించే అవకాశం ఉంది. పార్కింగ్ ప్రదేశంలో మెరక పనులు చేపట్టారు. కార్ పార్కింగ్ ప్రదేశంలో గ్రావెల్‌తో బురదలేకుండా చేస్తున్నారు.



వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

చినుకుపడితే చిత్తడే

- ప్రమాదకరంగా మారుతున్న రోడ్లు
- పూర్తికాని కల్వర్టుల పనులు
- వంతెనలవద్ద వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



చినద్వారపూడి వద్ద చిత్తడిగా మారిన రోడ్డు

మండపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం తాపేశ్వరం, జెడ్.మేడపాడు మధ్య సెంట్రల్‌రోడ్ ఫండ్‌తో నిర్మించిన రోడ్డుపనులు పూర్తయినా మధ్యలో ఉన్న కల్వర్టుల పనులు పూర్తికాలేదు. కేవలం ఇటీవల ప్రమాదకరంగా మారిన ఇప్పనపాడు, చినద్వారపూడివద్ద కలిపి మూడుచోట్ల తాత్కాలికంగా ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా రహదారులు భవనాల శాఖ తూరలను ఏర్పాటుచేసింది. తాపేశ్వరం-జెడ్‌మేడపాడు మధ్య ఏడుచోట్ల వంతెనలు శిథిలావస్థకు చేరగా వాటిస్థానే వంతెనలను నూతనంగా నిర్మించాల్సి ఉంది. పనులను చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవటంతో పనులు చేయలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో వంతెనల వద్ద రోడ్డు వేయకుండా వదిలేయటంవల్ల వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క చినుకుపడితే చాలు బురదమయంగామారి చిత్తడిగా మారుతుంది. ఇప్పటికైనా రహదారులు భవనాల శాఖాధికారులు ప్రమాదకంగా మారిన రోడ్డువద్ద మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారణకోసం చర్యలు తీసుకోవాలని వాహనదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!



గోపాలపురం ఇసుక ర్యాంపు, స్టాక్ పాయింట్ వద్ద నుంచి జాతీయ రహదారిపైకి పేరుకుపోయిన ఇసుక

రావులపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రహదారిపై ఎటువంటి గోతులు, స్పీడ్‌బ్రేకర్లు లేకుండా ఉండటంతో వేగంగా రాకపోకలు సాగిస్తుంటారు. జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో సగంమేర పైగా ఇసుక పేరుకుపోవడంతో ఆ ప్రాంతానికి వచ్చేసరికి ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. రావులపాలెం మండలంలో వశిష్ట వంతెన వద్ద నుంచి గౌతమి వంతెన వరకు జాతీయ రహదారి విస్తరించి ఉంది. గోపాలపురం ఇసుక ర్యాంపు సమీపంలోను ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద ఇసుక లోడులారీల రాకపోకల కారణంగా రహదారిపై ఇసుక జారిపోయి రహదారి పొడవునా పేరుకుపోయింది. వర్షం వచ్చినప్పుడు ద్విచక్రవాహనాలు జారిపోతున్నాయి. ఎండలు వచ్చిన సమయంలో వేగంగా వెళ్లే భారీ వాహనాల కారణంగా ఆ వేగానికి ఇసుక రేణువులులేచి ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడటంతో ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు వాపోతున్నారు. నిత్యం ఏదో సమయంలో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతునప్పటికీ అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంపట్ల ద్విచక్రవాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యామిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన



స్టాకు రిజిష్టరు పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ ఘనీ

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల రత్నంపేటలో విద్యామిత్ర స్టాక్ పాయింట్‌లో దుస్తులు, షూస్ మెటీరియల్‌ను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర రాష్ట్ర పరిశీలకుడు షేక్‌అబ్దుల్ ఘనీ, సర్వశిక్షాభియాన్ సీఎంవో సుబ్రహ్మణ్యం పరిశీలించారు. మెటీరియల్‌తో స్టాకు రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం విత్తనాల సుబ్బారావు, ఎంఈవో వీరెడ్డి, నాగేశ్వరి, సీఆర్ ఎంటీలు, పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల కిట్లు పరిశీలన

ఆలమూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లు నాణ్యతను జిల్లా అబ్జర్వర్ అబ్దుల్‌ఘని శుక్రవారం పరిశీలించారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కిట్లు స్టాక్ పాయింట్‌లో ఉన్న కిట్లు నాణ్యతను వివిద అధికారులతో కలిసి పరిశీలించారు. దుస్తులు, బూట్లు తదితర వస్తువుల నాణ్యతలను గుర్తించారు. అనంతరం స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు బి.అప్పాజీ, సుబ్బరాజు, సీఆర్‌ఎంటీలు, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బీవీవీ సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. అదేవిధంగా ఎస్ఆర్‌కేవీఎం స్టూడెంట్ కిట్స్ కోనసీమజిల్లా అబ్జర్వర్ అబ్దుల్ ఘనీ కె.గంగవరం ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, సీఆర్‌పీలు జుత్తగ వెంకటరమణ, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

● డ్వాక్రా యానిమేటర్లకు డివిజనల్ పంచాయతీ అధికారి సూచన



డ్వాక్రా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ అధికారి రాజు

ఆలమూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో చెత్త సేకరణపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలని రామచంద్రపురం డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపీడీవో ఎ.రాజు డ్వాక్రా యానిమేటర్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం యానిమేటర్ల సమావేశం ఏపీఎం ధనరాజు అధ్యక్షత జరిగింది. ఈసమావేశంలో ఎంపీడీవో రాజు మాట్లాడుతూ గ్రామాలలో తడి పొడి చెత్త సేకరణపై అవగాహన పెంచడంద్వారా సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని కోరారు. డ్వాక్రా సంఘాలలో ఉన్న మహిళలకు దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించి వాటి ద్వారా సంపద సృష్టించాలని ఆమేరకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఆయన చెప్పారు. పారిశుద్యం సక్రమంగా ఉంటే ప్రజలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి యానిమేటర్లు పూర్తి సహకారం అందించాలని కోరారు.

అర్హులైన వారందరికీ రుణాలు

మండలంలో డ్వాక్రా సంఘాలలో ఉన్న అర్హులైన మహిళలందరికీ రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీవో రాజు ఏపీఎం ధనరాజు తెలిపారు. డ్వాక్రా రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లింపులు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిక్వరీని మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కోశాధికారి యర్రంశెట్టి చంద్రిక, సిఎఎం నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా అమ్మవారికి కుంకుమార్చన



రాయవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆషాడమాసం శుక్రవారం పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ జరిపారు. అనంతరం అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఈకార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ భక్తులు పాల్గొన్నారు.

71వ రోజుకు శ్రీవాణి దీక్ష



దీక్ష చేస్తున్న వల్లూరి శ్రీవాణి

మండపేట, జూన్27(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరంలోవున్న జిల్లాపరిషత్‌కు చెందిన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించి ప్రహరీగోడ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి చేస్తున్న శాంతియుత దీక్ష శుక్రవారం 71వ రోజుకు చేరింది. పగలు విద్యాలయంగా ఉంటే రాత్రివేళ పాఠశాలకు రక్షణగోడ లేక మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాఠశాల మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలస్థలంను ఆక్రమించుకుని పలువురు పక్కాభవనాలు నిర్మించుకున్నారన్నారు, సర్వే నిర్వహించి వాటిని తొలగించాలని ఆమె ప్రభుత్వంను డిమాండ్ చేస్తున్నారు. తాను చేస్తున్న శాంతియుత దీక్ష ప్రహరీగోడ నిర్మించేవరకు విరమించేదిలేదని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రహరీగోడ నిర్మాణానికి గ్రామంలోవున్న ప్రైవేటు సంస్థ నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా స్థానిక రాజకీయ నాయకులు మొకాలు అడ్డుతున్నారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలు వదిలి విద్యార్థుల భవిష్యత్ నుదృష్టిలో ఉంచుకని ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కోఆప్షన్ సభ్యుడి ఎన్నికకు దరఖాస్తు చేసుకోండి

మండపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపాలీలో అధికార కౌన్సిల్ పాలకవర్గంనకు చెందిన ముస్లిం మైనార్టీ కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్ రబ్బాని తన పదవికి ఇటీవల రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో ఖాళీ ఏర్పడింది. ఆ పదవిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం కోఆప్షన్ సభ్యుడు ఎన్నికకు సంబంధించి అర్హులైన ముస్లిం మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని మండపేట మున్సిపల్ కమిషనర్ టీ.వీ.రంగారావు తెలిపారు. వచ్చేనెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

'మంచి వ్యక్తులను కోల్పోయాం'

రావులపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న అశోక్ ఎంతో మంచి వ్యక్తి అని అలాంటి వారిని కోల్పోవడం బాధాకరంగా ఉందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా కోదాడ వెళుతున్న ఎస్ఐ అశోక్ కారు రోడ్డు ప్రమాదానికి గురై ఎస్ఐతోపాటు కానిస్టేబుల్ జీవన్ మృతిచెందడం, మరో ఇరువురు కానిస్టేబుల్స్‌కు గాయాలు కావడం బాధాకరమన్నారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలి

రాయవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలని ఎంఈవో-2 వై.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరంలో ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో జూలై 12వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని వెదురుపాకలో ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జునుడు, రాయవరపు భాస్కర్, బొట్టా సురేష్ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

ఆత్రేయపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద సృష్టించి పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. శుక్రవారం బొబ్బర్లంకలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రిక్షాల ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి-వెంకన్నతో కలిసి పరిశీలించారు. అలాగే చెత్త సంపద కేంద్రంవద్దకు వెళ్లి పలు సూచనలు చేశారు. కార్యదర్శి హనుమ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రాయితీపై దాణా అందజేత

కె.గంగవరం, జూన్27(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సత్యవాడ గ్రామంలో పాడి రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వివరించారు. రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడాల మాచర్రావు, తాడాల పెద్ద, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం'



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్27 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని వారి సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజలనుంచి మంత్రి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అమరావతి, నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రజాదర్బార్ ద్వారా అర్జీలు స్వీకరించి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నియోజకవర్గం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మంత్రి సుభాష్‌కు సమస్యలపై అర్జీలు అందజేశారు.

రైతుబజార్ తనిఖీ

రామచంద్రపురంలో రైతుబజార్‌ను మంత్రి సుభాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ.80లక్షలతో నిర్మించిన రైతుబజార్‌ను మంత్రి సుభాష్ ఇటీవల ప్రారంభించారు. రైతులను పలుప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. మంత్రి సుభాష్ వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైన్‌పై ఆక్రమణల తొలగింపు



టేకిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని టేకి గ్రామంలో సాగు భూములు ముంపునకు కారణమైన రేణిగుంట మైనర్ డ్రైన్‌పై ఆక్రమణలు తొలగింపు, పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ శాఖ డీఈ పోచారావు, ఏఈ వీరబాబులు మాట్లాడుతూ ఇటీవల కొత్తగా ఎన్నికైన నీటిసంఘాల చైర్మన్ల ఆధ్వర్యంలో డ్రైనేజీ అభివృద్ధి పను లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేణిగుంట డ్రైన్‌పై ఉన్న ఆక్రమణదారులకు పంచాయతీ ద్వారా నోటీసులు అందించారన్నారు. ఈ డ్రైన్‌వల్ల ప్రతీఏటా సుమారు 300 ఎకరాలు పంట నీట మునిగిపాడైపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఈడ్రైన్ పూడికతీత కోసం సుమారు 2లక్షలు మంజూరు కాగా వాటితో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే డ్రైన్‌పై 300మీ. మేర ఆక్రమణలు ఉండటంతో వీటిని తొలగించేందుకు నీటిసంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, రైతులు, స్థానిక నేతలు సహకారంతో రెవెన్యూ, పోలీస్, డ్రైనేజీ శాఖల పర్యవేక్షణలో ఆక్రమణలు తొలగించి, డ్రైన్ వెడల్పు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, మాచర నీటిసంఘం అధ్యక్షుడు కొరపాటి రాంబాబు, కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వోలు వెంకటేశ్వరరావు, పి.నాగమణి, రెవెన్యూ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన

ఆలమూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకంవల్ల కలిగే అనర్థాలను ప్రతీఒక్కరూ గుర్తించి చెట్లను విరివిగా పెంచడం ద్వారా ఆరోగ్యం పెంపొందించిందిచవచ్చునని చిన్నారులకు అవగాహన కల్పించే కార్యక్రమం ఆలమూరు మండలం సంధిపూడి మండల పరిషత్ పాఠశాలలో చేపట్టారు. చిన్నారులకు ప్లాస్టిక్‌వల్ల కలిగే నష్టాలను వివరించడంతోపాటు చెట్లు పెంచడంపై అవగాహన పెంచారు. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో చెట్లు పెంచడం కోసం మొక్కలను తీసుకొచ్చి నా టే కార్యక్రమం ప్రారంభించారు. ప్రతీఒక్క రూ గణపతి నవరాత్రులకు మట్టి గణపయ్యలనే వాడాలని ఇప్పటి నుంచి అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు చెబుతున్నారు. చిన్నారులలో అవగాహన పెంచ డం అభినందనీయమని సర్పంచ్ తోట భవానీవెంకటేశ్వర్లు అన్నారు.

ఎంజీఎన్‌ఆర్‌జీఎస్, పంచాయతీరాజ్ పనులపై సామాజిక తనిఖీ

● రూ. 12,85,64,331లకు సోషల్ ఆడిట్

కె.గంగవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎంజీఎస్‌ఆర్‌జీఎస్, పంచాయతీరాజ్ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక డ్వామా పీడీ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఎంజీఎస్‌ఆర్‌జీఎస్ ద్వారా చేసిన 1033 పనులకు రూ.8,39,89,857 వేతనాలకు, రూ.83,57,779లు మెటీరియల్‌కు, పంచాయతీరాజ్ పనులు రూ.3,61,51,523లకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించిన తనిఖీ బృందాలు తమ నివేదికలను సభలో చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులు వేతనాల వివరాలను ఒక్కొక్కటిగా సభలో చదివి వినిపించారు. పొరపాట్లు జరిగిన పనులకు సిబ్బందికి రికవరీలు రాశారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ ఏ.సత్యనారాయణ, స్టేట్ టెక్నికల్ మేనేజర్ కె.సత్యనారాయణ, క్వాలిటీకంట్రోల్ ఎం.బాలాజీ, అంబుడ్స్‌మెన్ అడపా వెంకట శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, ఎంపీపీ పంపన నాగమణి పాల్గొన్నారు.



గంగవరంలో ఎన్ఆర్‌జీఎస్ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీల ఎంపిక



ఉచ్చిలిలో ఎంఆర్పీఎస్ గ్రామకమిటీని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామకమిటీలను ఏర్పాటు చేసినట్లు ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమర వీరరాఘవ పేర్కొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు కమిటీల ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. జూల్ 7న ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవానికి జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు, నూతన కమిటీల ఎంపిక, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉచ్చిలి, కట్టుంగ గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబ్, మండల ఎంఎస్పీ అధ్యక్షుడు ముప్పిడి పండు తదితరులు పాల్గొన్నారు.

నోయిడా జాతీయ శిక్షణలో వల్లూరు ఉపాధ్యాయుడు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని వల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు వాసంశెట్టి శ్రీనివాసరావు ఉత్తరప్రదేశ్ నోయిడాలో జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి ప్రతినిధిగా హాజరయ్యారు. థింక్ న్యూడ్జ్ అం డ్ మూవ్ డిపార్ట్‌మెంట్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండ ర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో 2 రోజులపాటు జరిగిన శిక్షణలో శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈయనను బ్యూ రో ఆఫ్ ఇండియన్ స్టాండర్డు సంస్థ విజయవాడ బ్రాంచ్ ప్రతినిధులు నామినేట్‌చేసి పంపినట్లు ఆయ న తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల ద్వారా విజ్ఞానశాస్త్రాన్ని అధ్యయనంచేసే పద్ధతులపై శిక్షణ ఇచ్చారన్నారు. సంస్థ నిర్వాహకుడు డాక్టర్ ఎస్.సూర్యకల్యాణి, చిత్రాగుప్తా నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని నియంత్రించాలి

● రామచంద్రపురం మండల సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

ద్రాక్షారామ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఫీజులు, యూనిఫాం, పుస్తకాలుపేరుతో ప్రైవేటు పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయని ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. రామచంద్రపురం మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో ఎంఈవో వీరెడ్డి మాట్లాడుతూ జూన్ 12 నుంచి జూలై వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. దీనిపై కాపవరం ఎంపీ టీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ ఇప్పటివరకు, సమస్యలతో ఉద్యమాలు, ఆందోళన అం టూ కాలం వెళ్లిబుచ్చారని ఇప్పుడు ప్రత్యేక డ్రైవ్‌తో ఏంచేస్తారన్నారు. ప్రైవేటు పాఠశాలలు నియంత్రణ లేని స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నారని, యూనిఫాం, షూస్, పుస్తకాలు విద్యార్థులు పాఠశాల నుంచి మాత్రమే తీసుకోవాలని తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని రెడ్నం సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ని యంత్రణ చేయాలని కోరారు. ఎంపీ బోస్ మా ట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు తనిఖీ చేయాలని, ఉపాధ్యాయుల అర్హతలు, పుస్తకాలు విక్రయం తదితర విషయాలపై ఎంఈవో తనిఖీ చేయాలని సూచించారు. తహసీల్దార్ మూడు సమావేశాల నుంచి హాజరుకావడంలేదని ఎంపీ టీసీ సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు నీరు వదిలిన తరువాత కాలువలు తవ్వడంపై ఎంపీ టీసీ సతీష్ ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారులు సమావేశానికి రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీ బోస్ అన్నారు. నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి సొమ్ములు చెల్లించడం లేదని సభ్యులతోపాటు ఎంపీ బోస్ వ్యవసాయాధికారిని ప్రశ్నించారు. నెలరోజులకు పైనుంచి సొమ్ములు చెల్లించాల్సిఉందని ఏవో మణిదీప్ సమాధానం ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మీ, ఎంపిడీవో కె.పద్మజ్యోతి, సర్పంచ్‌లు, ఎంపిటీసి సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వరదలపట్ల అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రానున్న వరదల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వరదల ముందస్తు చర్యల్లో భాగంగా అన్నిశాఖల మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలు, ఏర్పాట్లు, తదితర అంశాలపై వివరించారు. వరద ప్రభావిత గ్రామాల్లో గోదావరి వరదలను దృష్టిలో ఉం చుకుని జిల్లాస్థాయిలో గురువారం జిల్లా కలెక్టర్ అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై సమావేశం జరిపినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎస్ఐ హరీష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.